జేఎన్‌టీయూ విద్యార్థులకు శుభవార్త

బాలానగర్: జేఎన్‌టీయూ విద్యార్థులకు యూనివర్సిటీ అధికారులు శుభవార్త తెలిపారు. 2022లో జరిగిన ఫైనల్ సెమిస్టర్ పరీక్షల్లో తక్కువ మార్కులతో ఫెయిలైన విద్యార్థులకు గ్రేస్ మార్కులు (30మార్కులు) కలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. లెట్రల్ ఎంట్రీ విద్యార్థులకు 23 మార్కులు కలిపారు. తక్షణమే ఈ నిర్ణయం అమలులోకి వస్తుందని జీవోలో పేర్కొన్నారు. గ్రేస్ మార్కులు ఇవ్వడం వల్ల పలు డిపార్టుమెంట్లలోని విద్యార్థులకు మేలు జరిగిందన్నారు. చాలా కాలంగా విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వాలని కోరుతున్న నేపథ్యంలో పలు విభాగాల హెచ్‌ఓడీలతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రిన్సిపాల్ డా. కె. విజయకుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నిర్ణయంతో బీటెక్ విద్యార్థులకు అధికంగా మేలు జరుగుతుందన్నారు.

టీహబ్ స్టార్టప్ 'ఛోటు' ప్రారంభం



టీహబ్ స్టార్టప్ 'ఛోటు' క్యూఆర్ కోడ్‌ను ప్రారంభిస్తున్న సీఈఓ శ్రీనివాసరావు

రాయదుర్గం: వినూత్న ఆలోచనలున్న యువతను ప్రోత్సహించడమే టీహబ్ లక్ష్యంగా పనిచేస్తుందని సీఈఓ ఎం శ్రీనివాసరావు స్పష్టం చేశారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో శనివారం టీహబ్ స్టార్టప్ 'ఛోటు' క్యూఆర్ కోడ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశంలో 1.3 కోట్ల కిరాణాషాప్‌లు ఉన్నాయని, మిగతా రకాల షాపులు జతపరిస్తే, ఆ సంఖ్య భారీగా ఉంటుందన్నారు. యూపీఐతో చెల్లింపులు చాలా సులువుగా సాగుతున్నాయని, కానీ ఇంకా ఈ కామర్స్ లోకల్‌షాప్‌లు అందుబాటులోకి రాలేదన్నారు. ఛోటు ఈ వ్యత్యాసాన్ని తగ్గించగలదని భావిస్తున్నామన్నారు. 'ఛోటు' స్టార్టప్ సహ వ్యవస్థాపకుడు వై రవి మాట్లాడుతూ ఛోటు స్టార్టప్‌తో ప్రతి లోకల్‌షాప్‌ని ఆన్‌లైన్ చేయడమే తమ లక్ష్యం అని అన్నారు. మరో సహ వ్యవస్థాపకుడు వంశీ పంజాల మాట్లాడుతూ పాన్ ఇండియా సినిమాలకు హైదరాబాద్ పుట్టినిల్లు అని, తాము ముందుగా తెలుగు రాష్ట్రాలలో దీన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో టీహబ్ చీఫ్ డిజిటల్ ఆఫీసర్ వింగ్ కమాండర్ అంథోని అనీష్, తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంతతౌతం, ఛోటు స్టార్టప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అటు వ్యర్థాలు...ఇటు బండరాళ్లు

- ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల పర్వం
- అక్రమంగా దుకాణాలు...గుడిసెల ఏర్పాటు



హఫీజ్‌పేట్ సర్వే నంబర్ 69లో వ్యర్థాలు, బండరాళ్లు వేసిన దృశ్యాలు



సర్వే నంబర్ 69లో ప్రభుత్వ భూమి అంటూ బోర్డు పెట్టిన దృశ్యం

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి మండలంలోని హఫీజ్‌పేట్ గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా కొంతమంది వ్యర్థాలు, బండరాళ్ళు వేస్తున్నారు. కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిపై కన్నుపడింది. హఫీజ్‌పేట్ గ్రామ సర్వే నెంబర్ 69లోని 3.29 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. కొంతభూమి ఆక్రమణదారుల చేతిలోకి వెళ్ళగా ఇప్పుడు ఎకరన్నర ప్రభుత్వ భూమి మిగిలింది. ఆ మిగిలిన ప్రభుత్వ స్థలంలో కూడా పెద్ద బండరాళ్ళు, వ్యర్థాలు తరలించి పోస్తున్నారు. ఇటీవల కొంత కాలం క్రింద ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేయగా వెంటనే రెవెన్యూ అధికారులు వచ్చి ప్రభుత్వ భూమి చుట్టు వేసిన ఇనుప రేకులను తొలగించారు. కాగా ఇక్కడ పక్కనే ఉన్న ప్రైవేట్ భవన నిర్మాణ సంస్థకు చెందిన కూలీలు గుడిసెలు నిర్మించుకున్నారు. దాంతో మరి కొంతమంది ఏకంగా ప్రభుత్వ భూమి చుట్టూ దుకాణాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తున్నారు. శేరిలింగంపల్లి మండల తహసీల్దార్ చర్యలు తీసుకోవాలని హఫీజ్‌పేట్ గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమి బోర్డు పెట్టినా...

హఫీజ్‌పేట్ సర్వే నంబర్ 69 ప్రభుత్వ భూమిలో ఉన్న ఎకరన్నర భూమిపై కబ్జాదారుల కన్నుపడింది. హైటెక్ సమీపంలో ఉన్న ఈ ప్రభుత్వ భూమి కోట్లు విలువ చేస్తుంది. దీన్నే అదునుగా చేసుకున్న కబ్జాదారులు నెమ్మదిగా మట్టిపోస్తున్నారు. శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారుల అండదండలతోనే ఇదంతా జరుగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి



హఫీజ్‌పేట్ సర్వే నంబర్ 69లోని ప్రభుత్వ భూమి రోజు రోజుకు కబ్జారాయుళ్ళ చేతిలోకి వెళ్తుంది. ప్రభుత్వ స్థలం చుట్టు ఫెన్సింగ్ వేయాలి. కోట్లు విలువ చేసే భూమిపై కొందరి కన్ను పడింది. ఇప్పటికైన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలో వెలసిన దుకాణాలను తొలగించాలి.

-గౌస్, హఫీజ్‌పేట్

బండరాళ్లను తొలగించాలి



ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వేస్తున్న వ్యర్థాలను, బండరాళ్లను రెవెన్యూ అధికారులు తక్షణమే తొలగించాలి. బండరాళ్లు వేసిన వారిపై చర్యలు తీసుకావాలి. ప్రభుత్వ భూమిని పేద ప్రజలకు అవసరాలకు ఇవ్వాలి.

-అనంత్, హఫీజ్‌పేట్

నేటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

మోతీనగర్: పాండురంగనగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 17 నుంచి జనవరి 15వ తేదీవరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ వీఎస్‌వీ సత్యనారాయణ, కార్యనిర్వాహణ అధికారి జీఏకే కృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మొదటి రోజు ఉదయం 5.15 గంటలకు ధనుర్మాస వ్రతారంభం, సేవాకాలం, నివేదన, మంగళ శాసనములు, తీర్థప్రసాద గోష్ఠి, 23వ తేదీ శనివారం ఉదయం 4.15 గంటలకు వైకుంఠ ఏకాదశి, ఉత్తర ద్వార దర్శనం, విశేషమైన అలంకరణతో శ్రీవారి దర్శనం, ఉదయం 11.30 గంటలకు సామూహిక శ్రీసత్యనారాయణ స్వామివ్రతంతో ఈ ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

భూగర్భ డ్రైనేజీ సమస్యను త్వరలో పరిష్కరిస్తాం



సఫ్దార్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని సఫ్దార్‌నగర్‌లో కార్పొరేటర్ సబిహా బేగం శనివారం వర్కు ఇన్‌స్పెక్టర్ వినాయకరావుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... భూగర్భ డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. అదే విధంగా సీ–బ్లాక్‌లో సీసీరోడ్డు కోసం లెవెలింగ్ పనులను పరిశీలించానన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సలీం, షాహిద్, ఆస్మా తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ పిలుపు మేరకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు జానయ్య సమక్షంలో చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాబోయే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకి చట్టభద్రత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 20వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, మాధవరం రంగారావు, కొత్తదొడ్ల జాన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ ప్రసంగాన్ని అవమానించటం సిగ్గుచేటు

కాంగ్రెస్ నేత శేరి సతీష్‌రెడ్డి

కూకట్‌పల్లి: గవర్నర్ ప్రసంగం అంతా అసత్యాలు, తప్పులేనని, ప్రసంగం విని ఓ సభ్యుడిగా సిగ్గు పడుతున్నానని సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అనడం గవర్నర్‌ను అవమానించటమేనని కూకట్‌పల్లి కాంగ్రెస్ నేత శేరి సతీష్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. పెద్దలను గౌరవించడం మన సంస్కృతి అని.. ప్రతి మనిషి తన స్థాయిని మరిచి మాట్లాడితే సమాజం హర్షించదన్నారు. అసెంబ్లీ సమావేశాలను సజావుగా సాగనీయకుండా, అడుగడుగునా అడ్డుకోవటం బీఆర్ఎస్ నాయకులకే చెల్లిందన్నారు.

పాఠశాలలోనే సరైన పునాది వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సుశీందర్‌రావు

రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్‌రావు

రాయదుర్గం: విద్యార్థుల సమగ్ర వికాసానికి ప్రభుత్వ పాఠశాలల్లోనే సరైన పునాదులు పడతాయని రంగారెడ్డిజిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్‌రావు అన్నారు. శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల కోసం నిత్యం ఓ గంట సమయం విధిగా కేటాయించాలని ఆయన సూచించారు. పిల్లలు సరైన మార్గంలో ఉన్నారా....? లేదా...? అని తెలుసుకుంటుండాలని, ఎప్పటికప్పుడు చదువులో వారి ప్రగతిని అంచనా వేయాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరానికి నూతన పాఠశాల భవనాలన్నీ అందుబాటులోకి వస్తాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాజ్‌బాబు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల అవసరాలకు తగినట్లుగా మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. ఒకటి నుంచి అయిదవ తరగతి వరకు సాధించాల్సిన బోధనా లక్ష్యాలను విజయవంతంగా సాధించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఆలిండియా క్రాఫ్ట్ మేళా

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



మాదాపూర్: శిల్పారామంలో ఏర్పాటు చేసిన ఆలిండియా క్రాఫ్ట్‌మేళా సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. శనివారం సెలవురోజు కావడంతో సందర్శకులు పోటెత్తారు. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేశారు. సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ తంజావూర్ స్పాన్సర్ చేసిన గారడీ గొంబే, బుట్టబొమ్మలు, సూర్యప్రకాశ్ బృందం నృత్యం, త్రిప్తి నగర్ ఉజ్జయిని నుంచి వచ్చిన కళాకారులు జానపద నృత్యంతో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కాత్యాయిని శిష్య బృందం భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు.

కూకట్‌పల్లిలో నటి కాజల్ సందడి



భాగ్యనగర్‌కాలనీ: కూకట్‌పల్లిలోని పీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన దేవి పవిత్ర గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంను శనివారం నటి కాజల్ అగర్వాల్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... శుభకార్యాలకు రకరకాల బంగారు ఆభరణాలు, వజ్రాభరణాల కోసం ఎక్కువ షాపులు తిరిగే అవసరం లేకుండా అన్ని ఇక్కడే లభిస్తాయన్నారు. ఇక్కడ ఉన్న వజ్రాభరణాల కలెక్షన్స్ మహిళలను ఆకట్టుకుంటాయన్నారు. ఈ సందర్భంగా షోరూం నిర్వాహకులు మాట్లాడుతూ.. తమ మొదటి షోరూం విజయవాడలో ఏర్పాటు చేశామని ఇది రెండో షోరూం అని పేర్కొన్నారు. వినియోగదారులకు ఎప్పటికప్పుడు కొత్త కలెక్షన్లు అందిస్తున్నామని తెలిపారు. పోల్కి డైమండ్స్, నగిషీ, కుంద బ్రైడల్ జ్యువెలరీ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

అన్నమయ్య స్వరార్చన



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా సరస్వతి సంగీత శిక్షణాలయం విద్యార్థులు స్వరార్చనతో సందర్శకులను అలరించారు. గురువు ఎన్. సరస్వతి శిష్యబృందం అన్నమయ్య కీర్తనలు గణనాయకం, ఆదిమూలమే, తిరుమల గిరిరాయ, నారాయణ, జయలక్ష్మి , వరలక్ష్మీ, ఇతడే పరబ్రహ్మ తదితరాలు ఆలపించారు. వీరికి వయోలిన్ షణ్ముఖశర్మ, మృదంగం మల్లికార్జున శర్మ వాయిద్య సహకారం అందించారు. అనంతరం కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు.

కుట్టు మెషిన్ల పంపిణీ



కుట్టుమెషిన్లను పంపిణీ చేస్తున్న కొండ విజయ్‌కుమార్ తదితరులు

హఫీజ్‌పేట్ : లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం చందానగర్ హుడాకాలనీలో రెండు కుటుంబాలకు కుట్టుమెషిన్లను కొండ విజయ్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు దొంతి లక్ష్మినారాయణగౌడ్, కరుణాకర్‌గౌడ్, జనార్దన్‌రెడ్డి, వినయ్‌కుమార్‌గౌడ్, శంకర్ ముదిరాజ్ పాల్గొన్నారు.



జాబ్ మేళాకు విశేష స్పందన



జాబ్ మేళాకు వస్తున్న యువత



జాబ్ మేళాను ప్రారంభిస్తున్న వీసీ డా. నర్సింహారెడ్డి

బాలానగర్: జేఎన్‌టీయూలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. సుమారు 65వేల మంది జాబ్‌మేళాకు తరలి రావడంతో యూనివర్సిటీ ప్రాంగణం పూర్తిగా నిండిపోయింది. యూనివర్సిటీ ఎస్‌ఐటీ బిల్డింగ్ ఆవరణలో వైస్ చాన్సలర్ డా. కట్టా నర్సింహారెడ్డి మెగా జాబ్ మేళాను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేడు అనేక కంపెనీలు యువతకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వడానికి ఒకే వేదికపై రావటం సంతోషకరమన్నారు. ప్రిన్సిపాల్ డా. కె. విజయ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఒకే వేదికపై అనేక కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించడం యువతకు మంచి అవకాశమన్నారు. సుమారు 10వేల మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని పీఆర్ఓ డా. ప్రసన్న తెలిపారు. ఈ జాబ్ మేళా డైరెక్టర్ డా. తారా కళ్యాణి, డా. సురేష్ కుమార్ పలు కంపెనీలకు చెందిన సీఈఓలు పాల్గొన్నారు.

ఎల్లమ్మ చెరువులో మురుగు కలవకుండా చూస్తాం

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు సుందరీకరణ, సంరక్షణ, అభివృద్ధి పనుల్లో భాగంగా శనివారం మురుగునీటి మళ్లింపు పైప్‌లైన్ నిర్మాణ పనులను శనివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులను 2కోట్ల 74 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టినట్లు తెలిపారు. పనులను వేగవంతం చేసి నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఆదేశించారు. చెరువు చుట్టు పక్కల ఉండే కాలనీవాసులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌తో పాటు కంచెను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే చెరువును దత్తత తీసుకొని సొంత నిధులతో శుభ్రపరిచామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్

పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలి



జేఎన్‌టీయూలో జరిగిన పేరెంట్స్ డే సమావేశంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు

బాలానగర్: జేఎన్‌టీయూలోని సీఆర్‌సీ సెమినార్ హాలులో శనివారం పేరెంట్స్ డే సమావేశంలో జరిగింది. సుమారు 130 మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. విద్యార్థుల చదువు విషయం, వారి ప్రవర్తనకు, ఆయా సబ్జెక్టుల్లో వస్తున్న మార్కులు, మరింత మెరుగైన మార్కుల కోసం తీసుకునే చర్యలను విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రిన్సిపల్ డా. కె.విజయకుమార్‌రెడ్డి వివరించారు.

కళాశాలలో ఉన్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని చదువులో రాణించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఆయా డిపార్టుమెంట్‌ల హెచ్‌ఓడీలు సబ్జెక్టు ఎక్స్‌పీరియన్స్ ప్రొఫెసర్లు హాస్టల్ వార్డెన్స్, పేరెంట్స్ అడిగి పలు సందేహాలకు సమాధానం ఇచ్చారు. సీఆర్‌సీ చైర్మన్ డా. వి. పార్వతి తల్లిదండ్రులు వారి పిల్లల పట్ల బాధ్యతగా ఉంటేనే మనం వారికి మంచి భవిష్యత్ ఇచ్చిన వారవుతామన్నారు. విద్యార్థులను చాలా జాగ్రత్తగా గమనిస్తూ ఉంటామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల సందేహాలను వైస్ ప్రిన్సిపాల్ డా. జీవీ నర్సింహారెడ్డి, ప్రొఫెసర్స్ నివృత్తి చేశారు.

పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేస్తాం

- కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జై భారత్‌నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. డివిజన్‌లో చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, దేవి, డ్రైనేజీ సూపర్‌వైజర్ నరేందర్, కాలనీవాసులు కుమారస్వామి, ప్రభాకర్, శివరామకృష్ణ, సాంబశివరావు, వెంకటేశ్వరరావు, సురేష్, రాఘవేందర్‌రావు, హరి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.